ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.2 । కనిష్ఠం 26.4
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 9 జూన్ 2024

» ఉమ్మడి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాలా లేకుండానే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు
» అక్రమ రిజిస్ట్రేషన్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ప్రత్యేక దృష్టి
» ఫిర్యాదులు పెరుగుతుండడంతో ప్రత్యేక నిఘా





రిజిస్ట్రేషన్లపై నజర్!

నిజామాబాద్, జూన్‌8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్లపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు నజర్ పెట్టారు. కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నాలా కన్వర్షన్ లేకుండానే ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ప్రభుత్వ స్థలాల్లో కూడా రిజిస్ట్రేషన్ చేయడంతో వాటి వివరాలను సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 10 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో పరిశీలిస్తున్నారు. పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓవైపు పరిశీలిస్తున్నా గానీ ఈ కార్యాలయాల కార్యకలాపాలపై ఏసీబీ అధికారులు కూడా దృష్టిపెట్టారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యాలయాల వివరాలను సేకరిస్తుండటంతో అధికారుల్లోనూ గుబులు రేపుతోంది.

• ఉమ్మడి జిల్లా పరిధిలో పది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం పది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీంగల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, దోమకొండ, బిచ్కుంద, బాన్సువాడ పరిధిలో ఈ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో ఇండ్ల స్థలాలతో పాటు ఇళ్లను, వ్యవసాయేతర ఆస్తులనురిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పట్టణాలతోపాటు గ్రామాల్లో సంబంధించిన ఆస్తులను రిజిస్ట్రేషన్ కొనసాగిస్తున్నారు. ఏ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసిన పూర్తిస్థాయి అనుమతులను పరిశీలించాకే చేస్తున్నారు. కొన్ని భూముల రిజిస్ట్రేషన్ పూర్తిస్థాయి అనుమతులు లేకుండా చేయడంతో ప్రభుత్వానికి నివేదికలు అందడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దర్యాప్తునకు ఆదేశాలు ఇచ్చింది. నిజామాబాద్ అర్బన్, రూరల్ పరిధిలో పెద్దఎత్తున వెంచర్లు వెలుస్తున్నాయి.

• నాలా కన్వర్షన్ కూడా చేయకుండానే..

వెంచర్లన్నీ ప్రభుత్వనిబంధనల ప్రకారం వ్యవసాయ భూములను ప్లాట్లు చేస్తే వ్యవసాయేతర భూములుగా మార్చాలి. నాలా కన్వర్షన్ తీసుకోవాలి. వెంచర్లు ఏర్పాటు చేసినప్పుడు 10శాతం భూమిని గ్రామ పంచాయతీకి గానీ, మున్సిపాలిటీకి గానీ వదిలిపెట్టాలి. భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించుకునే విధంగా ఆ భూమిని ఉంచాలి. కొత్తగా ఏర్పడుతున్న వెంచర్లలో ఎక్కువశాతం భూములను వదిలి పెట్టకుండానే ప్లాట్లు చేసి అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని వెంచర్లలో నాలా కన్వర్షన్ కూడా చేయడం లేదు. అధికారులతో కలిసిపోయి పైరవీలు చేయించుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నాలా కన్వర్షన్ చేయకుండా రిజిస్ట్రేషన్ చేయడంతో ప్రభుత్వానికి పెద్దఎత్తున రెవెన్యూ తగ్గిపోతోంది. కొన్నివారికి కూడా ఇబ్బం దులు తలెత్తుతున్నాయి. ఇళ్ల నిర్మాణం సమయంలో కానీ, రుణాలు తీసుకునే సమయంలో కానీ ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ పరిధిలో కొన్ని ఇటువంటి రిజిస్ట్రేషన్లు చేయడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

• బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయడంపై కేసులు

ప్రభుత్వ భూములను కూడా కొన్నిచోట్ల వివరాలు చూడకుండా రిజిస్ట్రేషన్ చేయడం వల్ల చర్యలు చేపట్టింది. కొన్ని ఇండ్లు, ప్లాట్లను కూడా బై నెంబర్లు వేసి ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ చేయడం వల్ల పోలీస్ స్టేషన్‌లలో కేసులను నమోదు చేశారు. సబ్ రిజిస్ట్రార్‌లను బదిలీ చేయడంతో పాటు వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. కొన్నిచోట్ల ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌లుగా సీనియర్ అసిస్టెంట్లను నియమించడం వల్ల ఎక్కువ మొత్తంలో ఇటువంటి రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు అధికారులు గుర్తించారు. కొంతమందిపై చర్యలను కూడా చేపట్టారు.

• నేతలు, రియాల్టర్ల ఒత్తిళ్లు..

ఈ రిజిస్ట్రేషన్‌ల వ్యవహారంలో అధికార పార్టీ నేతలతోపాటు కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఒత్తిళ్లు తేవడంతో ఈ రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ఇవేకాకుండా ఇతర రిజిస్ట్రేషన్లు కూడా జరగడంతో ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు అందడంతో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఆదేశాలను ఇచ్చారు. వారు ఉమ్మడిజిల్లా పరిధిలోని రికార్డులను పరిశీలిస్తు న్నట్లు తెలుస్తోంది. ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల వ్యవహారాలను పరిశీలించడంతోపాటు ఎక్కడెక్కడ ఎక్కువగా జరిగాయో వివరాలను తీసుకుంటూ ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో నివేదిక అందించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

• నివేదిక ఆధారంగా చర్యలు

నివేదిక ఆధారంగా కొంతమంది అధికారులపై కూడా చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో పది సబ్‌రిజిస్ట్రార్‌ల కార్యాలయాల్లో వివరాలను తీసుకుంటున్న అధికారులు ప్రభుత్వానికి నివేదించిన తర్వాత చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కొన్ని కార్యాలయాలపై ఏసీబీ అధికారులు కూడా నజర్ పెట్టినట్లు తెలుస్తుంది. ఆయా కార్యాలయాల పరిధిలో జరుగుతున్న తతంగాలను పరిశీలించడంతో పాటు అవసరమైన సమయంలో తనిఖీలను చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ వ్యవహారాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి పెట్టడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల

• ఏడు నెలల క్రితం నిలిచిన ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ • రేపటి నుంచి ప్రక్రియ షురూ..

నిజామాబాద్ అర్బన్, జూన్ 8: గతంలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత ఏడు నెలల క్రితం నిలిచిపోయిన ప్రక్రియను తిరిగి నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. ఇదివరకు బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు ప్రధానోపాధ్యాయులుగా కొత్త పాఠశాలల్లోకి అడుగుపెట్టనున్నారు. మిగతా స్థానాలకు షెడ్యూల్ ప్రకారం బదిలీలు నిర్వహించనున్నారు. కొంతకాలంగా ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల కోసం ఎదురుచూస్తుండగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో విద్యాశాఖ గతంలో నిలిచిపోయిన ప్రక్రియను తిరిగి నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 10 నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించనున్నారు. 10, 11 తేదీల్లో దరఖాస్తులు చేసుకునే అవకాశం, 12, 13తేదీల్లో సీనియారిటీ జాబితా విడుదల, 14, 15 తేదీల్లో తుదిజాబితా ప్రచురణ, 16 నుంచి 20 వరకు ఎస్టీటీలకు పదోన్నతులు, 21నుంచి 24వరకు బదిలీల ప్రక్రియను నిర్వహించనున్నారు. కొద్దికాలంగా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండగా ఇప్పుడు కేవలం రంగారెడ్డిలో మాత్రమే కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతాచోట్ల కోర్టుకేసులన్నీ పరిష్కారమవడంతో అన్నిస్థాయిలో పదోన్నతులు ఏకకాలంలో చేపట్టే అవకాశం ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలోనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మొదలుపెట్టగా నాన్‌స్పౌజ్‌లు కోర్టును ఆశ్రయించడంతో ఆగస్టులో బదిలీలు, పదోన్నతులపై కోర్టు స్టే ఇచ్చింది.

• జిల్లాలో 848 ఖాళీలు

జిల్లాలో 848 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఖాళీలు 103ఉండగా సీనియారిటీ ప్రకారం స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల ఖాళీలు 78ఉండగా వీటిని పదోన్నతులతో భర్తీ చేయాల్సి ఉంది. సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసిన తర్వాత పదోన్నతుల ప్రక్రియకు బ్రేక్ పడింది. స్కూల్ అసిస్టెంట్ అన్ని విభాగాల్లో కలిపి ఇప్పటి వరకు 346 ఖాళీలు ఉన్నాయి. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల భర్తీ తర్వాత వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఖాళీ అయిన 70 శాతం పోస్టులను ఎస్టీటీలకు పదోన్నతి ఇచ్చి భర్తీ చేసి మిగిలిన నియామకాలతో భర్తీ చేయాల్సి ఉంటుంది. భాషాపండితులతో పాటు ఎస్టీటీల పదోన్నతులు, బదిలీలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

• ఎనిమిదేళ్లుగా పదోన్నతుల్లేవ్..

విద్యాశాఖలో గత కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో ఉపాధ్యాయులంతా నిరాశతో ఉన్నారు. గత ప్రభుత్వం 2023 జనవరిలో బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసినా కోర్టు కేసులతో నిలిచిపోయింది. 2023 సెప్టెంబర్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు బదిలీల ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల పదోన్నతుల విషయంలో ఎస్టీటీలు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఎస్‌ఏల బదిలీలు పూర్తయినా వారి స్థానంలో కొత్తవారు వచ్చే అవకాశం లేక చాలామంది రిలీవ్ కాలేకపోయారు. గత ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులు పదోన్నతుల అర్హత ఉన్నప్పటికీ పదోన్నతులు పొందలేక ఉద్యోగ విరమణ చేసి నష్టపోయారు. ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ, ఎంఈవో పోస్టులను ఈ బదిలీల అనంతరం భర్తీ చేసే అవకాశం ఉంది. రాబోయే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగితే విద్యార్థులకు పూర్తిస్థాయి ఉపాధ్యాయులు విద్యాబోధన చేసే అవకాశం ఉంది.

• తాత్కాలిక జాబితా ప్రదర్శన

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్‌లు, భాషాపండితులు, పీఈటీలకు సంబంధించిన సీనియారిటీ తాత్కాలిక జాబితాను ప్రదర్శించారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌విడుదల కావడంతో విద్యాశాఖ అధికారులు సీనియారిటీ జాబితాను రూపొందించే పనిలో ఉన్నారు. సెప్టెంబర్ 2023లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా ఉండగా ప్రభుత్వం బదిలీ అయిన పీఎస్ హెచ్‌ఎంలు, ఎస్‌ఏ వెంటనే రిలీవ్ కావాలని ఆదేశాలు ఇవ్వడంతో అక్కడ రిలీవ్ అయి చాలామంది హెచ్‌ఎంలు శనివారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

• హాజరుకానున్న 12,833 మంది అభ్యర్థులు • 41 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్, జూన్ 8: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లాలో 12,833 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 10.30నుంచి 1గంట వరకు పరీక్ష జరుగనుంది. ఇందుకోసం జిల్లాలో 41పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష జరిగే సమయాల్లో పరీక్షకేంద్రాలవద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. పరీక్షకేంద్రాలలో నిరంతరం విద్యుత్ సరఫరాతోపాటు ఆరోగ్య సిబ్బంది, తాగునీరు, ఇతరత్ర అన్నిరకాల సదుపాయాలను ఏర్పాటు చేశారు. పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపనున్నారు. అభ్యర్థులను 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 10 గంటలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. బయోమెట్రిక్ ద్వారా హాజరు విధానాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని నిర్వహకులు తెలిపారు.

మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల, పాఠశాలల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 8: నగరంలోని ధర్మపురి హిల్స్‌లోగల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల బాలుర-2లో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో 8 మైనార్టీ సీట్లు, 7వ తరగతిలో 12 మైనార్టీ సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మహ్మద్ బషీరుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో 23 మైనార్టీ సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 10నుంచి దరఖాస్తుల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు, తల్లిదండ్రులు వివరాల కోసం 7995057904 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. గతంలో మాధవనగర్ వద్దగల శ్రీమేధా భవనంలో ఉన్న ఈ కళాశాల, పాఠశాలను ప్రస్తుతం ధర్మపురి హిల్స్‌లోని ఎంఎస్‌డీటీ బిల్డింగ్ సీ-బ్లాక్‌లోకి మార్చినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో యువత ఆగం!

ఈజీ మనీకి అలవాటు పడి..

• సురేష్, నందిపేట్



క్రికెట్ బెట్టింగ్‌లతో పల్లెల్లో, పట్టణాల్లో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి ఎంతోమంది యువత ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి బెట్టింగ్ ఆప్‌లపై ప్రభుత్వం దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి. యువత సైతం ఈసీ మనీకి అలవాటు పడి బెట్టింగ్‌లకు పాల్పడకుండా చదువులపై దృష్టిసారించాలి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలి.

» రోడ్డున పడుతున్న కుటుంబాలు
» అప్పులతో బలవుతున్న యువత ప్రాణాలు
» మొన్నటి వరకు ఐపీఎల్ ప్రస్తుతం టి-20 వరల్డ్‌కప్
» ప్రత్యేక ఆప్‌లలో బెట్టింగ్



సుభాష్‌నగర్, జూన్‌8: సులువుగా సంపాదించాలనే ఆశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లవైపు మొగ్గు చూపుతున్నారు. పదివేల ఫోన్ ఉంటే చాలు అందులో వచ్చే ఆకర్షణీయమైన బెట్టింగ్ ప్రకటనలకు ఆకర్షితులైన యువత ప్రత్యేక ఆప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మొదటగా కొన్ని డబ్బులు అకౌంట్‌కు పడ గానే డబ్బులు వస్తాయన్న ఆశతో ఉన్న డబ్బులన్నీ బెట్టింగ్ ఆప్‌లలో పెట్టి నష్టపోతున్నారు. కొన్నిరోజుల నుంచి ఐపీఎల్ క్రికెట్‌తో యువత మొత్తం టీవీలకు, ఫోన్‌లకు అతుక్కుపోయారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతూ సొమ్మునంత పోగొట్టుకున్నారు. కొందరు యువకులు తమ సొంత డబ్బులను ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోతే మరికొందరు అప్పులు తెచ్చి బెట్టింగ్‌లకు పాల్పడ్డారు. ఇంకొందరు తమ కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్‌లో నుంచి వారికి తెలియకుండా డబ్బులు తీసి బెట్టింగ్‌లకు పాల్పడుతూ నష్టపోతున్నారు. ఐపీఎల్ ముగిసిన వెంటనే టీ-20 వరల్డ్ కప్ మొదలు కావడంతో మళ్లీ యువత బెట్టింగ్‌ల జోరందుకుంది.

• రోడ్డున పడుతున్న కుటుంబాలు

ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లతో కొన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కుటుంబంలో పెద్దలు తాము సంపాదించిన డబ్బును అంతా బ్యాంకుల్లో జమ చేస్తుండగా వారి పిల్లలు వారికి తెలియకుండా డబ్బులను విత్‌డ్రాలు చేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి కుటుంబాలను రోడ్డుకీడుస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం దాచిన పెద్దమొత్తంలోని డబ్బులను వారి పిల్లలే బెట్టింగ్‌లకు పాల్పడడంతో వారి తల్లిదండ్రులు బయటకు చెప్పుకోలేక లబోదిబోమంటున్నారు. బయటకు చెబితే కన్నకొడుకును ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందోననే భయంతో బతుకు తున్నారు. మరి కొన్ని కుటుంబాల్లో తమ పిల్లలను తప్పుచేసావని నిలదీస్తే ప్రాణాలు తీసుకుంటున్నారు. దీంతో వారికి పుత్రశోకం మిగులుతోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఇప్పటివరకు చాలానే జరిగాయి. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో డబ్బులు కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. మరికొందరు బెట్టింగ్‌ల కోసం అప్పులు చేసి తిరిగి చెల్లించలేక ప్రాణాలు వదిలారు. ఇదంతా బయటకు మామూలుగానే ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్నా చాలా వరకు యువత ఆత్మహత్యలు బెట్టింగ్‌లకు పాల్పడి సర్వం కోల్పోయి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

బెట్టింగ్ ఆప్‌లపై చర్యలేవీ ?

జిల్లాలో బెట్టింగ్‌లకు పాల్పడి యువత ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా బెట్టింగ్ ఆప్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో యువత నష్టపోతోంది. బెట్టింగ్ ఆప్‌లను ప్రముఖులే ప్రమోట్ చేస్తున్నారు. ఇదంతా ప్రభుత్వ ఉన్నతాధికారులు చూస్తూ చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి బెట్టింగ్ ఆప్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకొని యువత ప్రాణాలు బలికాకుండా చూడాలని కోరుతున్నారు.

• ప్రత్యేక ఆప్‌లలో బెట్టింగ్

సోషల్ మీడియాలో ఏది ఓపెన్ చేసినా పలురకాల ఆకర్షణీయమైన బెట్టింగ్ యాప్‌లు పదేపదే వస్తుండడంతో యువత ఆకర్షితులవుతున్నారు. వాటిని ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేసుకుని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. దీనికి తోడు ప్రముఖులు బెట్టింగ్ ఆప్‌లను ప్రమోట్ చేస్తుండడంతో వారిపై నమ్మకంతో డబ్బులు ఈసీ సంపాదించొచ్చనే ఆశతో యువకులు బెట్టింగ్‌లవైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా యువతను మొగ్గలోకి దింపేందుకు మొదటగా డబ్బులు వచ్చేట్లు వారిని బానిసలుగా చేస్తున్నారు. ఆ తర్వాత భారీగా డబ్బులు దండుకుంటున్నారు. బెట్టింగ్ పెట్టిన మొదట్లో డబ్బులు వచ్చేసరికి యువతలో పెద్ద మొత్తంలో వస్తాయని ఆశలు చిగురిస్తున్నాయి. రూ.వంద నుంచి మొదలైన బెట్టింగ్ లక్షల వరకు బెట్టింగ్‌కు పాల్పడేటట్లు చేస్తున్నారు. దీనికి ప్రత్యేక ఆప్‌లను తయారు చేస్తున్నారు. ఆప్‌లను విరివిగా ప్రకటనలిచ్చి ఆకట్టు కుంటున్నారు. బెట్టింగ్‌లకు వందల్లో ఆప్‌లు ప్లేస్టోర్‌లో ఉంటున్నాయి.



క్రికెట్ బెట్టింగ్‌పై టాస్క్‌ఫోర్స్‌తో నిఘా

• రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌పై నిఘాను పెంచాం. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై కూడా సీరియస్‌గా తీసుకున్నాం. టాస్క్‌ఫోర్స్ టీమ్‌తో ఎప్పటికప్పుడు అనుమానం ఉన్న చోట దాడులు చేస్తున్నాం. పాత కేసులు ఉన్న వారిపై నిఘా పెట్టాం. యువత ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడకుండా కష్టపడి ఉన్నత ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలి.

చేప మందు కోసం వెళ్లి మృతి

సిరికొండ జూన్ 8 : ఉబ్బసం వ్యాధి కోసం ప్రతి ఏడాది హైదరాబాద్‌లో ఇచ్చే చేప మందు కోసం వెళ్లిన మామిడి రాజన్న(60) తొక్కిసలాటలో కింద పడిపోయి చనిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి సిరికొండ మండలం రామడుగు గ్రామానికి చెందిన మామిడి గొల్ల రాజన్న తన మనుమడితో కలిసి హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మృగశి కార్తె రోజు ఉబ్బసం వ్యాదికి ఇచ్చే చేపమందు కోసం శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఉదయమే ఆరున్నర -ఏడు గంటల సమయంలో క్యూలో ఉన్న వారిలో తొక్కిసలాట జరుగడంతో రాజన్న కింద పడిపోయాడు. అక్కడ ఉన్న పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా రాజన్న చికిత్స పొందుతూ మరణించాడు. వెంట ఉన్న మనుమడు రాజన్న శవాన్ని స్వగ్రామానికి తీసుకరాగా బంధువులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య శనివారం అంతక్రియలు నిర్వహించారు. రాజన్నకు భార్య చిన్న సాయమ్మ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యులు రాజన్న శవాన్ని చూసి బోరున విలపించారు. గ్రామంలో విశాదశ్ఛాయలు నెలకొన్నాయి.

● ప్రభుత్వం ఆదుకోవాలి

ఉబ్బసం వ్యాధి నయం చేసుకోవడానికి చేపమందు తీసుకోవడానికి వెళ్లి చనిపోయిన రాజన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కటుంబ సభ్యులు కోరుతున్నారు. ముగ్గురు ఆడపిల్లల తండ్రి కావడంతో పాటు ఆయన కుటంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సామూహిక కుంకుమార్చన పూజలు

మోపాల్, జూన్ 8:నగర సమీపంలో ఉన్న బోర్గాం(పి) లక్ష్మిగణపతి ఆలయంలో శనివారం సామూహికంగా కుంకుమార్చన, పూజలు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో శ్రీ సూక్త సహిత శ్రీ లక్ష్మి మహా యాగములో భాగంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే మహిళలు ఆలయ ప్రాంగణంలో సామూహికంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు అరుణ్‌శర్మ తెలిపారు. ఈనెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఈ యాగము, హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేదపండితుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర భక్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో మూకుమ్మడి తనిఖీలు

పెద్దబజార్, జూన్ 8:ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీల కోసం ఏర్పాటు చేసిన వైద్య శాఖ బృందాలు ఒకవైపు జిల్లా అంతటా జల్లెడ పట్టాయి. నగరంలో మాత్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ఆసుపత్రిలో తనిఖీలు చేయలేదు. కేవలం ఐఎంఏ ఇచ్చిన నివేదికను యదావిధిగా ప్రభుత్వానికి పంపాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఈ అంశం వైద్య వర్గాల్లో చర్చకు దారి తీసింది. నగరంలో పలు ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేకపోగా ముఖ్యంగా కొందరు కనీస అర్హతను లేకుండానే వైద్యం చేస్తున్నారని అన్నారు. మల్టీ స్పెషాలిటీ బోర్డులు ఏర్పాటు చేసి స్థాయికి మించి వైద్యం అందించి రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయాన్ని కొందరు క్వాలిఫై వైద్యులు సైతం తప్పుపడుతున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు చేయాలని ఆదేశించింది. దీంతో వైద్య అధికారులు కొన్ని రోజులుగా ఆర్మూర్, బోధన్‌తో పాటు అన్ని చోట్ల ప్రైవేటు ఆసుపత్రులు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో తనిఖీ చేశారు.


తనిఖీలు చేస్తున్న అధికారులు

ఇక్కడ మాత్రం ఎందుకిలా...

నగరంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. పలు ఇండ్లను ఆసుపత్రిలుగా మార్చారు. వైద్యులు కానీ వారు సైతం మల్టీస్పెషాలిస్టు పేరిట ఆసుపత్రులను నెలకొల్పారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు 50 శాతం చొప్పున కమిషన్‌లు ఇచ్చి పేద రోగుల నుంచి ముక్కుపిండి వారి వద్ద నుంచి అధిక ఫీజులు దోచుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద అనేక ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ సూచనలతో పకడ్బందీగా తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎలాంటి తనిఖీలు చేయకుండానే ఐఎంఏ నివేదికతో మమా అనిపించే యోచనలో ఉన్నారు. నగరంలోని ఆసుపత్రుల్లో క్షేత్రస్థాయి తనిఖీల కోసం 20 బృందాలను ఏర్పాటు చేయగా ఎవరూ కూడా తనిఖీలకు వెళ్లలేదని అధికారులు ఆదేశాలు ఇవ్వడం ఇందుకు నిదర్శనం.

నగరంలో పలు ఆసుపత్రుల్లో తనిఖీలు...

నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులు మెడికవర్, కోనార్క్, లైఫ్‌లైన్ ఆసుపత్రులలో శనివారం డీఎంహెచ్‌వో బృందం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, హెచ్‌సీవో సంతోష్, హెచ్‌ఏ రఘు, శ్రీధర్‌లు తనిఖీలు చేశారు.

బ్రెయిన్ ట్యూమర్ చాలా ప్రమాదకరమైనది

పెద్దబజార్, జూన్ 8: బ్రెయిన్ ట్యూమర్ చాలా ప్రమాదకరమైన వ్యాధి అని మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. శనివారం నగరం లోని ఎల్లమ్మగుట్టలో గల మెడికవర్ ఆసుపత్రిలో ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం అందరం కలిసి మెదడు కణితుల ద్వారా ప్రభావితమైన వారి జీవితాల్లో మార్పు చేయ వచ్చని అన్నారు. బ్రెయిన్‌లోని కణితుల సమీపంలో కనజాల ను నిర్మాణంలో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలను బ్రెయిన్ ట్యూమర్ అంటారు. వీటిలో కొన్ని క్యాన్సర్‌తో సంబంధం లేనివి, మరికొన్ని క్యాన్సర్‌తో సంబంధం ఉన్నవి అని అన్నారు. బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకు పెరుగుతుంది. దీర్ఘకాలం పాటు రేడియే`షన్‌కు గురైన వ్యక్తులు, పొగ తాగే వ్యక్తులు బ్రెయిన్ ట్యూమర్‌లను అభివృద్ధి చేసే ప్రమాదం ఎక్కువగా ఉంటుంద న్నారు. ఒక వ్యక్తి బ్రెయిన్‌లోని ట్యూమర్ రకం పరిణామం, స్థానం పెరుగుదల రేటు ప్రకారం మార్పులు ఉంటాయని అన్నారు. వీటి లక్షణాలను గుర్తించడం కష్టమని ఎందుకంటే అవి ఇతర అనారోగ్య సమస్యలైఉంటాయని అన్నారు.


న్యూరోసర్జన్ డాక్టర్ కృష్ణ ఆదిత్య

వ్యాధి లక్షణాలు...

తలనొప్పి, తలలో ఒత్తిడి, ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి, పడుకున్నప్పుడు తలనొప్పి ఎక్కువగా రావడం, వికారం, వాంతులు, ఏవైనా రెండుగా కనిపించడం జరుగుతుందన్నారు.

లోక్‌అదాలత్‌తో ఇరువర్గాలకు సమ న్యాయం

న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్, జిల్లా న్యాయాధికారిణి సునీత


చెక్కు అందజేస్తున్న న్యాయాధికారిణి

నిజామాబాద్ లీగల్, జూన్ 8:లోక్‌అదాలత్‌తో ఇరువర్గాలకు సమన్యాయం జరుగుతుందని న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్, జిల్లా న్యాయాధికారిణి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్ జిల్లా కోర్టులో శని వారం జిల్లా జాతీయ లోక్ అదాలత్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌కు ముఖ్య అతిథిగా న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయాధికారిణి సునీత కుంచాల హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 12 కోట్లకు పైగా కక్షిదారులకు నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. మొత్తం 16వేలకు పైగా కేసులను రాజీకి కుదిర్చారని ఇందులో క్రిమినల్ కేసులు 6,500, మోటార్ యాక్సిడెంటల్ కేసులు 30, బ్యాంక్‌అండ్ సివిల్ కేసులు 9వేలు, మొత్తం 11 బెంచీలలో ఇరువర్గాల కక్షిదారులతో రాజీకి కుదిర్చి కేసులు కొట్టివేయడం జరిగిందని అన్నారు. 1984లో 10 కోట్ల భూనష్ట పరిహార కేసు నారాయణరావు వేయగా దాంట్లో కలెక్టర్ లోక్‌అదాలత్‌లో 6కోట్ల 11లక్షల 12,111 రూపాయల చెక్కును జిల్లా జడ్జి కక్షిదారుడికి అందజేశారు. మిగతా బ్యాంక్, ఇన్సూరెన్స్ కేసులలో 6కోట్లకు పైగా వివిధ కక్షిదారులకు నష్టపరిహారం అందజేయడం జరిగింది. అనంతరం రెండవ అదనపు న్యాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకోవడంతో వారికి సమయంతో పాటు మనశాంతి కూడా దొరుకుతుందని అన్నారు. అంతేకాకుండా దీనిద్వారా సమన్యాయం జరుగుతుందని తెలిపారు. జేసీ కిరణ్‌కుమార్, ఏసీపీ రాజా వెంకట్‌లు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అ దాలత్‌లో కక్షిదారులకు మా వంతు కృషి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, జూనియర్ సివిల్ జడ్జిలు గోపీకృష్ణ, కుష్బు చటోపాధ్యాయ, శ్రీనివాస్, చైతన్య, జీపీ శ్రీహరి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల పంచాయితీ.. ఇరువర్గాల దాడి

ఖిల్లా, జూన్ 8: నగరంలోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖైరీఫారం తాజ్‌దాబా వద్ద భార్య తరఫున బంధువులను భర్త దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్సై మొగులయ్య తెలిపారు. బోధన్‌లోని ఫతేపూర్ గ్రామానికి చెందిన సభాబేగంను నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్ ప్రాంతానికి చెం దిన సయ్యద్ అలీతో వివాహం జరిగింది. వీరికి ఒక కు మారుడు, కూతురున్నారు. ఐదు సంవత్సరాల కాలంలో భార్యభర్తల మధ్య తీవ్ర మనస్పర్థలు వచ్చాయని నాలుగు సార్లు కుల పెద్దలతో పంచాయతీ పెట్టించడం జరిగిందని సభాబేగం తండ్రి సయ్యద్ యూసుఫ్ తెలిపారు. ఈ క్రమంలో భర్తతో గొడవపడిన సభాబేగం పుట్టింటికి తొమ్మిది నెలల క్రితం వచ్చిందని అన్నారు. శనివారం భార్యభర్తల పంచాయతీ మరోసారి కుల పెద్దల వద్దకు రావడంతో ఇద్దరిని సముదాయించి గొడవలు పడకుండా కలిసిమెలసి ఉండాలని సూచించారు. పంచాయతీ అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో భార్య తరఫున బంధువులపై భర్త కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడ్డ క్షతగ్రాతుడిని చికిత్స నిమిత్తం బంధువులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సయ్యద్ అలీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిపై పిచ్చికుక్కల దాడి

జక్రాన్‌పల్లి, జూన్8: బాలుడు తాత ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా అటు వైపు నుంచి వస్తున్న పిచ్చికుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేశాయి. దీంతో బాలునికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం జక్రాన్ పల్లి మండలం చందమియాబాగ్‌తాండా గ్రామంలో బానవత్ దీరాజ్ ఐదేళ్ళ బాలుడు తన తాత బానవత్ దారసింగ్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా పిచ్చికుక్కలు దాడి చేశాయి. పిచ్చికుక్కలు దాడి చేయడంతో బాలుడు దిరాజ్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటన చూసి తాండా గ్రామస్థులు అక్కడికి చేరుకొని కుక్కలను చెదరగొట్టి బాలుడిని కాపాడారు. తల్లిదండ్రులు బానవత్ విరేందర్ బాలుడు దిరాజ్‌ను చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్రగాయాలైనందున అక్కడి నుంచి వైద్యులు నిజామాబాద్‌కు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి దీరాజ్ తలకు సర్జరీ చేయాల్సి ఉందని వైద్యులు తెలిపినట్లు బాలుని తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు దీరాజ్ చికిత్స పొందుతున్నాడు.

పిచ్చికుక్కల బెడద నుంచి రక్షించాలి....

మండలంలోని వివిధ గ్రామాల్లో పిచ్చికుక్కడ బెడద అధికమైంది. గ్రామాల్లో ఏటుచూసిన కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. చిన్నపిల్లలు రోడ్డు వెంట వెళ్తే కుక్కలు ఎప్పుడే ఏం చేస్తాయో తెలియక పిల్లల తల్లిదండ్రులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరుగుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


దుస్తులతో క్రీడాకారులు

ఆర్మూర్‌రూరల్, జూన్8: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ తరఫున బెహరన్‌లో హైదరాబాద్ యువకుల క్రికెట్ జట్టు సభ్యులకు శనివారం క్రీడా దుస్తులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ రాజారెడ్డి మాట్లాడుతూ రాకేష్‌రెడ్డి ఫౌండేషన్, వివిధ సంస్థల ద్వారా, విదేశాల్లో ఉన్న వారికి సహాయం అందజేస్తు న్నామని వారు తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన వారి మృతదేహాలన సొంత గ్రామాలకు చేర్చడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గల్ఫ్ దేశాల్లో సైతం సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

హోటళ్లపై అధికారుల తనిఖీలు

సుభాష్‌నగర్, జూన్ 8:రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు నగరంలోని పలు హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఎలాంటి సమాచారం లేకుండా హోటళ్లపై దాడులు నిర్వహించారు. నగరంలోని ప్రధాన హోటళ్లపై ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించి హోటళ్లలో కుల్లిన ఆహారంపై ఫినాయిల్ పోశారు. నగరంలోని అరోమ, వంశీ, తదితర హోటళ్లపై తనిఖీలు నిర్వహించి కిచెన్‌లోని పరిస్థితులను పరిశీలించారు. నగరంలో గత కొన్ని రోజులుగా మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు ఉదయం నుంచి తనిఖీలు నిర్వహించి పలు హోటళ్లపై చర్యలు తీసుకున్నారు. కుల్లిన మాంసాన్ని చెత్తబుట్టలో పారేశారు. లోకల్‌గా ఉన్న ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే రాష్ట్ర అధికారులు నేరుగా తనిఖీలు నిర్వహించడంతో హోటల్ యజమానులు అవాక్కయ్యారు. దాడులు కొనసాగుతున్నాయన్న సమాచారంతో మిగతా హోటళ్లలో ఉన్న పాడైపోయిన వాటిని ముందే తీసివేశారు. ఈ తనిఖీల్లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న అధికారులు

డిచ్‌పల్లి సీఎంసీ పరిధిలో వ్యక్తి దారుణ హత్య

● నిందితుడి ఇంటిపై దాడిచేసిన మృతుడి బంధువులు ● గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు


ఇంటికి నిప్పంటించిన బాధితులు


మృతుడు వెంగల్ (ఫైల్)


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

ఇందల్వాయి, జూన్8: మండలం మేగ్యానాయక్ తండాకు చెందిన లకావత్ వెంగల్ (36) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేగ్యానాయక్ తండాకు చెందిన వెంగల్ గత గురు వారం ఉదయం రేషన్ బియ్యం తీసుకొస్తానని బైకుపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆయన సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, అతని బంధువులు ఆచూకీ కోసం వెతికగా వాహనం ధర్పల్లి రోడ్ లోగల బజాజ్ షోరూం సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి వారు ఆ చుట్టుపక్కల గాలించారు. ఇందులో డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల గ్రామాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించగా సీఎంసీ సమీపంలో గల ఓ వైన్స్ వద్ద వెంగల్ కనిపించగా, బిక్యానాయక్ మద్యం కొనుగోలు చేసినట్లు సీసీ పుటేజీలో ఆధారాలు లభించాయి. పశువులను కాస్తున్న కొందరు సీఎంసీ పక్కన శుక్రవారం సాయంత్రం సమయంలో మృతదేహం పడి ఉందని పోలీసుల సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా వెంగల్ మృతదేహంగా నిర్ధారణకు వచ్చారు. మృతదేహంపై యాసిడ్ పోసి ఆధారాలు దొరకకుండా కాల్చివేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బిక్యానా యక్‌ను పట్టుకొని పోలీసులు విచారణ చేస్తున్నారని తెలియడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని బీక్యానా యక్ ఇంటికి నిప్పు పెట్టి ఇంట్లోని వస్తువులన్నీ ధ్వం సం చేశారు. దీంతో మేగ్యానాయక్ తండాలో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు పెద్దఎత్తున తండాకు చేరుకొని బందో బస్తును ఏర్పాటుచేశారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రజలను శాంతింపజేశారు. గ్రామంలో భారీ బందోబస్తును చేపట్టారు. పోలీసులు డబ్బులు తీసుకొని కేసును పక్కదోవ పట్టిస్తున్నారని తండా వాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై డిచ్‌పల్లి సీఐ మల్లేష్‌ను వివరణ కోరగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేశామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

లోక్‌అదాలత్‌లో 1163 కేసులు పరిష్కారం

ఆర్మూర్‌టౌన్ , జూన్8:పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్‌జడ్జి నసీంసుల్తాన అధ్యక్షతన శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో 1163 కేసులను పరిష్కరించారు. ఇరుపక్షలు రాజీ చేసుకొని కేసులను పరిష్కరించుకోవడం జరిగింది. అందులో భాగంగా బ్యాంకులకు సంబంధించిన పీఎల్‌సీలు, ఈపీ కేసులు, టైటిల్ కేసులతో పాటు మెయింటనెన్స్ కేసులు, సీసీ కేసులు, సైబర్ క్రైమ్ కేసులను ఆమె పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి పి.శ్రీనివాస్‌రావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కోడెటి శంకర్, కార్యదర్శి అరుణ్, న్యాయవాదులు సి.కిష్టయ్య, జీజీ.రాం, అవరి రమేష్, కృష్ణంరాజు, జె.శ్రీధర్, ఆనంద్, పోశన్న, రాజేశ్వర్, దాస్, డి.కిరణ్, బ్యాంకు అధికారులు, పోలీస్ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట, జూన్8: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కోర బోయిన హరీష్ (24) గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బొ ల్లారం గ్రామానికి చెందిన కోర బోయిన హరీష్ అదే గ్రామానికి చెందిన అ మ్మాయిని ప్రేమించి గత ఆరు నెలల క్రితం ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. పెళ్లి జరిగినప్పటి నుంచి భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేసేవాడని తెలిపారు. కళ్యాణలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసేందుకని నాలుగురోజుల క్రితం గ్రామానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. హరీష్ చిన్నచిన్న విషయాలను మనసులో పెట్టుకుని తనలో తాను బాధపడుతుండేవాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో కాలకృత్యాలకని వెళ్లిన హరీష్ రాత్రివరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతనికోసం వెతకగా గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

బాన్సువాడలో కురిసిన వర్షం

బాన్సువాడ టౌన్, జూన్ 8: బాన్సువాడ పట్టణంలో శనివారం సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. జూన్ మొదటి వారంలోనే వర్షం కురియడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వాతావరణం సైతం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం

బీర్కూర్, జూన్ 8: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి వారిని అమ్మవార్లను శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ప్రకాష్‌రావు క్యాంప్‌కు చెందిన ఓ భక్తుడు ఆలయ సన్నిధిలో శ్రీవారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెల్లిని కాపాడబోయి అక్క మృతి


విచారణ జరుపుతున్న ఎస్సై రాజశేఖర్

కమ్మర్‌పల్లి, జూన్8: కమ్మర్‌పల్లి మండలం గాంధీనగర్ శివారులోని వరదకాలువలో ఆత్మహత్యకు పాల్పడిన చెల్లిని కాపాడబోయి అక్క పనేటి శ్యామల(38) మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణానికి చెందిన పానేటి శ్యామల తన తండ్రితో కలిసి కమ్మర్‌పల్లి మండలంలోని గాంధీనగర్‌లోని తన చెల్లెళ్లు మంజుల ఇంటికి వచ్చింది. మంజులకు, భర్తతో సంసారం విషయంలో గొడవలు జరుగుతున్నందున చెల్లెని సముదాయించాలనే శ్యామల ఇక్కడికి వచ్చింది. శనివారం చెల్లిని, మరిదిని సముదాయిస్తున్న సమయంలో తాను చనిపోతానంటూ మంజుల ఇంటికి దగ్గరలో ఉన్న వరదకాలువలో దూకింది. ఆమె వెనుకలే పరిగెత్తుకుంటు వెళ్ళిన అక్క శ్యామల చెల్లిని కాపాడడానికి వరదకాలువలో దూకగా శ్యామల నీట మునిగి చనిపోయిందన్నారు. అక్కడ ఉన్న స్థానికలు కాలువలోకి చీరను విసరగా మంజుల దానిని పట్టుకొని పైకి రావడంతో క్షేమంగా బయటపడింది. ఈ విషయమై మృతురాలు శ్యామల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

'గోవధ చట్టాన్ని అమలు చేయాలి'

ఎల్లారెడ్డి, జూన్ 8 : అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించి గోవధ జరగకుండా చూడాలని గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని శనివారం ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మహేష్, నాగిరెడ్డిపేట్ ఎస్ఐ రాజుకి విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఎల్లారెడ్డి శాఖ తరపున వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భాగంగా భజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ వినోద్, ఎల్లారెడ్డి సంయోజక్ భారత్, తులసీదాస్, గోరక్ష రాహుల్, నాగసాయి, చరణ్, బన్ని పాల్గొన్నారు.

బోధన్‌లో కత్తిపోట్ల కలకలం

● కల్లు తాగే క్రమంలో గొడవ
● కత్తితో ఒకరిపై దాడి.. మెడపై తీవ్రగాయాలు

బోధన్‌రూరల్,జూన్8: బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల కల్లుబట్టిలో కల్లు తాగే క్రమంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ కత్తిపోట్లకు దారితీసింది. గంగాధర్ అనే వ్యక్తి కల్లు తాగుతుండగా పక్కన ఉన్న జీవన్ సింగ్ అనే వ్యక్తితో మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. జీవన్ సింగ్ అనే వ్యక్తి తన వద్ద ఉన్న కత్తితో గంగాధర్ అనే వ్యక్తి మెడపై పొడవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు నిందితుడిని పట్టుకుని చితకబాది అనంతరం పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు గాయాలపాలైన గంగాధర్‌ను బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కత్తితో తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని సీఐ వీరయ్య తెలిపారు.


దాడిలో గాయపడ్డ బాధితుడు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ముప్కాల్, జూన్8:రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతీఒక్కరు రక్తదానం చేయాలంటు డాక్టర్ ఉమమహేశ్వర్‌రెడ్డి అన్నారు. మమత నర్సింగ్‌హోం స్థాపించి 44ఏళ్లు కావడంతో వార్షికోత్సవంలో భాగంగా శనివారం ముప్కాల్ మండల కేంద్రంలోని మమత నర్సింగ్‌హోమ్ రక్త దానం నిర్వహించారు. ఆసుపత్రిలో 23మంది యువకులతో పాటు స్థానిక ఎస్సై బాస్కరచారి రక్తదానం చేశారు. 43ఏళ్లుగా ముప్కాల్ మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల మండలాలకు డాక్టర్ ఉమమహేశ్వర్‌రెడ్డి చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువ జన సంఘం అధ్యక్షుడు అంజయ్య, జిల్లా కబడ్డీ సెక్రెటరీ గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు లింగం, ముస్కు మోహన్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జూన్8:మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు కొండపై చేరుకొని స్వామివారి పల్లకిని కొండ చుట్టు ప్రదక్షిణ చేయిం చారు. అనంతరం ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కొండపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపికలు

సుభాష్‌నగర్, జూన్ 8:జూనియర్ రగ్బీ బాల బాలికల ఎంపికలు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు రెంజర్ల నరేష్, అబ్బయ్యలు తెలిపారు. మోపాల్ మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 10గంటల నుంచి ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 01-01-2006, 2007, 2008లో జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11, 12, 13తేదీల్లో జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


పాల్గొన్న పూర్వవిద్యార్థులు

సాహెబ్‌పేట్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

వేల్పూర్, జూన్8:వేల్పూర్ మండలం సాహెబ్‌పేట్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో 2003-04విద్యాసంవత్సరం 5వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ళ అనంతరం పూర్వవిద్యార్థులు ఒక చోట కలుసుకున్నారు. వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలలో, ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు సాహెబ్‌పేట్ గ్రామానికి చేరుకొని పాఠశాలలో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకొని వారి యోగక్షేమాలు, ప్రస్తుతం వారు చేస్తున్న పనులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యానేర్పిన గురువులను శాలువ, జ్ఞాపికాలతో సన్మానించి వారి ఆశీర్వదాలు అందుకున్నారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఒక చోట సహపంక్తి భోజనాలు చేశారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

సిరికొండ జూన్8:పదిరోజుల క్రితం దుబాయిలో చనిపోయిన గూండ్లశేఖర్ మృతదేహం స్వగ్రామానికి చేరగా కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రుల అశ్రునయనాల మధ్య శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన గూండ్ల శేఖర్ బతుకు దెరువు కోసం గత పదిహేను, ఇరువై ఏళ్ల నుండి దుబాయి వెళుతూ వస్తున్నాడు. రెండేళ్ల క్రితం గ్రామానికి వచ్చి వెళ్లిన శేఖర్ గత పదిరోజుల క్రితం దుబాయిలో ఉరి వేసుకుని మరణించాడని గ్రామస్థుల ద్వారా సమాచారం అందింది. శనివారం శేఖర్ మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు గ్రామస్థుల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అప్పుల కారణంగానే ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు చెపుతున్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

సిరికొండ,జూన్8:సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కోసం శనివారం వీడీసీ పెద్దలతో కలిసి గౌడసంఘం పెద్దలు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు కిరణ్,మాజీ సర్పంచ్ పొడెండ్ల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ చందర్, నాయకులు జగన్, మహేష్‌గౌడ్, మోహన్‌యాదవ్, సుదర్శన్‌గౌడ్, సన్నీ, సుదర్శన్ గౌడ సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేత నాగంపేట్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ముప్కాల్,జూన్8:ముప్కాల్ మండల కేంద్రంలోని చైతన్య యువజన సంఘ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో నాగంపేట్ మొదటి విజేత, రెండో స్థానంలో నల్లూర్, మూడోస్థానంలో బాల్కొండ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. శనివారం ముప్కాల్ మండల కేంద్రంలోని మమత నర్సింగ్‌హోం 44 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒక రోజు క్రీడా పోటీలను నిర్వహించారు. వీరికి మొదటి బహుమతి నాగంపేట్‌కు రూ.10వేలు, ద్వితీయ బహుమతి నల్లూర్‌కు రూ.5వేలు, మూడవ బహుమతి బాల్కొండకు రూ.1000 పారితోషికాన్ని క్రీడాకారులకు బహుమతులను ఏసీపీ బస్వారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమమహేశ్వర్‌రెడ్డి, గంగాధర్, ఎస్సై భాస్కరచారి, జిల్లా కబడ్డీ సెక్రెటరీ ముస్కు మోహన్, పోలప్రవీన్, రాములు, గోపి, దినేష్, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో తనిఖీలు

ధర్పల్లి, జూన్ 8:మండలంలోని వివిధ విత్తన, ఎరువుల దుకాణాల్లో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విత్తనాలు రైతులందరికి అందే విధంగా చూడాలన్నారు. కల్తీ విత్తనాలు రైతులకు ఇవ్వవద్దని ఆదేశించారు. సీడ్స్ ప్యాకెట్ వచ్చే బిల్లులను సైతం తప్పకుండా రైతులకు ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

రెంజల్,జూన్8: ఐదు సంవత్సరాలలోపు పిల్లలను ప్రైవేటు స్కూల్‌లలో చేర్పించకుండా అంగన్‌వాడీలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి అన్నారు. శనివారం మండలంలోని అంబేద్కర్‌నగర్‌లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ర్యాలీగా బయల్దేరి ఇంటిలో ఉన్న తమ పిల్లలను ఎల్‌కేజీ, యుకేజీ ప్రముఖ్యత, పిల్లల యొక్క శారీరక, మానసిక ఎదుగుదల, అంగన్‌వాడీ కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధుర బాయి, టీచర్లు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘననివాళి

సుభాష్‌నగర్, జూన్ 8:తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళులు అర్పించారు. నగరంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రామోజీరావు పత్రికా రంగంలో వటవృక్షమన్నారు. రామోజీరావు మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్, నర్సింలు, నర్సింహరావు, లవంగరాజు, మల్లారెడ్డి, ఫిరోజ్, హరీష్, రాజేశ్వర్, విష్ణు, బాలాజీ, సత్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని:రామోజీరావు మృతికి సంతాపంగా శనివారం వర్ని మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకులు, కమ్మసంఘం ఆధ్వర్యంలో ఘననివాళులు అర్పించారు. ఎన్టీ రామారావు విగ్రహం ఎదుట రామోజీరావు చిత్రపటానికి పుష్పగుచ్ఛం వేసి సంతాపం తెలిపారు. పత్రికారగంలో ఎనలేని సేవలు అందించి పద్మభూషణ్ అవార్డును అందుకున్న రామోజీరావు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖుల ప్రశంసలు పొందారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రెడ్డి వీర్రాజు, నామాల సాయిబాబా, డిష్ గణపతి, గోపాల్, పెనుమర్తి శ్రీహరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ :రామోజీరావు మరణం పట్ల బోధన్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు జాతికి పత్రిక రంగాన్ని, జర్నలిజానికి రామోజీరావు చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి న్యాయవాది సీహెచ్‌వీ.హన్మంత్ రావు, ఉపాధ్యక్షులు పావులూరి వెంకటేశ్వర్ రావు, తెలుగు యువత నాయకులు రావెళ్ల శ్రీనివాస్, సచిన్ పటేల్, విఠల్ పటేల్, కృష్ణారెడ్డి, రవికుమార్, భాస్కర్‌లున్నారు.

బడిబాట కార్యక్రమం

వేల్పూర్, జూన్7:రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం వేల్పూర్ మండల కేంద్రంలోని పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. బడిఈడు కలిగిన పిల్లలు, బడి మానివేసిన విద్యార్థుల కోసం ఇంటింటికి వెళ్ళి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనేర్చుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, చదువు యొక్క ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పది మంది విద్యార్థులను చేర్చుకున్నారు. ఉపాధ్యాయులు దేవనందం ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య, వనిత, శారద, వెంకటేశ్వర్, రవికుమార్, ఆశవర్కర్‌లు కవిత, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్:మండలంలోని దూపల్లి గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం గురించి కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన తీరును వివరించి ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకట లక్ష్మి, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మిదేవమ్మ, ఉపాధ్యాయులు సాయన్న, శ్రీనివాస్, తదితరులున్నారు.

బోధన్‌రూరల్:బోధన్‌లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో జానకి అంగన్‌వాడీ కేంద్రాల నుండి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేందుకు ముందుకు రావాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లను పరిశీలిస్తూ బాలింతలు, గర్భివతులకు అవగాహన కల్పించారు.

మోర్తాడ్:మండలంలోని మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, దొన్కల్, సుంకెట్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. చదువుకునే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ పిల్లలను గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనలతో పాటు హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తామని వారికి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.71,900	రూ.66,100	రూ.910

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.20, 10.20)
: ముంజియా (హిందీ) (1.35)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (4.20)
: సత్యభామ (7.25)

స్క్రీన్-2 : బ్యాడ్ బాయ్స్ (10.30, 4.30, 10.30)
: మనమే (1.15, 7.15)

స్క్రీన్-3 : సత్యభామ (11.25, 10.40)
: భజే వాయువేగం (2.20)
: వెపన్ (5.15)
: ముంజియా (హిందీ) (7.55)

స్క్రీన్-4 : గోల్డ్ నెంబర్-1 (10.30)
: లవ్ మౌలీ (1.20)
: గంగం గణేషా (4.25)
: రక్షణ (7.30)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.50, 1.45, 4.40, 7.35, 10.30)

స్క్రీన్-2 : రక్షణ (10.25)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.30)
: సత్యభామ (4.30)
: భజే వాయువేగం (10.30)

స్క్రీన్-3 : లవ్ మౌలీ (10.40)
: బ్యాడ్ బాయ్స్ (1.45, 7.45)
: రక్షణ (4.30)
: సత్యభామ (10.30)

దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : రక్షణ (11.00, 6.00), వెపన్ (2.00, 9.00)

విజయ్ : మనమే (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్